సాక్షి
జగిత్యాల
ఆదివారం । 26 । జనవరి । 2025



రాజ్యాంగ స్ఫూర్తి.. గణకీర్తి

- సాగు, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణింపు
- ఆదర్శం.. పలువురు ఉమ్మడి జిల్లావాసులు
- రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి

అవకాశాలు, హక్కులతో అభివృద్ధికి బాటలు

మన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు, హక్కులు, బలహీనులకు ఆపన్నహస్తం ఇచ్చింది. దాని నీడలో గ్రామాలు, నగరాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. రాజ్యాంగ ఫలాలతో తమను తాము తీర్చిదిద్దుకుంటున్న ఎందరో దేశ ప్రగతి, సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. చదువుకున్న పలువురు యువత ఉద్యోగాలు వదిలి, సాగు బాట పట్టారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ.. ఆదాయం పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధి కోసం ఎదురుచూసిన కొందరు మహిళలు యజమానులుగా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ యువత దేశ రక్షణకు సైన్యంలో చేరుతున్నారు. దేశభక్తి పెంపొందేలా పలు ప్రాంతాల్లో నిత్య జనగణమన ఆలపిస్తున్నారు. జాతీయ జెండాల తయారీతో సిరిసిల్ల నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి జెండాలు దేశవ్యాప్తంగా సరఫరా అవుతుండటం మనకు గర్వకారణం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి, నేటితో 75 ఏళ్లు పూర్తవుతున్న, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురిపై ప్రత్యేక కథనం.

దేశమంతటికీ సిరిసిల్ల జెండాలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్ల. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బట్టతో జాతీయ జెండాలు తయారవుతాయి. స్వాతంత్ర్య, గణతంత్ర, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా ఇక్కడి జెండాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతూ ఇక్కడి నేతన్నల ఉపాధికి అండగా నిలుస్తున్నాయి. ఆగస్టు 15వ తేదీకి, జనవరి 26వ తేదీకి ముందుగానే లక్షల్లో జెండాల తయారీ, అమ్మకాలు జరిగిపోతాయి. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన వస్త్రాన్ని ప్రాసెసింగ్ చేసి, మూడు రంగుల్లో ప్రింటింగ్ చేయిస్తారు. ఆ బట్టను జెండాల సైజును బట్టి, మెషిన్లపై మహిళలు కుడుతారు. ఒక్కో జెండాను రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పల్లెల నుంచి సైన్యంలోకి..


అనిల్ విగ్రహం వద్ద సేవా మెడల్‌తో సతీమణి సౌజన్య

పెద్దపల్లిరూరల్/ఇల్లంతకుంట/మల్యాల/బోయినపల్లి: పల్లె యువత సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. సరిహద్దుల్లో పహారా కాస్తూ దేశ రక్షణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతున్నారు. పెద్దపల్లి మండలంలోని మారెడుగొండ, బ్రాహ్మణపల్లి నుంచి దాదాపు 40 మంది యువకులు సైన్యంలో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, తదితర విభాగాల్లో పని చేస్తున్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన మేకల విజయ్‌కుమార్ మాజీ సైనికుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట నుంచి ఏడుగురు యువకులు ఆర్మీ సైనికులుగా చైనా, పాకిస్తాన్ బార్డర్‌లలో ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన జెట్టి పోచయ్య, ఎండీ.జైనుద్దీన్ మొదటగా ఆర్మీలో సేవలందించారు. మల్యాల, బోయినపల్లి మండలాల నుంచి కూడా పలువురు యువకులు సైన్యంలో సేవలందిస్తున్నారు. మల్కాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్ 2023 మే 4న జమ్మూకశ్మీర్‌లోని నదీలో హెలికాప్టర్ పడిపోయిన ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నెల 14న పుణేలో జరిగిన భారత సైనిక దినోత్సవంలో మరణానంతర సేవా మెడల్‌ను అనిల్ సతీమణి సౌజన్యకు అందజేశారు.

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారికి నమస్కరిస్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించారు.

ఓటు నమోదు చేసుకోండి


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాలటౌన్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్ సూచించారు. జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి రవికుమార్, ప్రిన్సిపాల్ అశోక్, సోషల్ వర్కర్ రాజగోపాలాచారి, ఎన్‌ఎస్‌ఎస్, ప్రభుత్వ అధికారులు, యువత పాల్గొన్నారు.

అందరితో చర్చించాకే పథకాలు


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: గ్రామసభలు పెట్టి అందరితో చర్చించాకే అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగు గోడల మధ్యనుంచే సంక్షేమ పథకాలు జారీ చేసిందని, కాంగ్రెస్ అలా చేయబోదని వెల్లడించారు. మండలంలోని దుంపేట, దూలూర్, సిరికొండ, చింతకుంట గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు శనివారం భూమిపూజ చేశారు. మండలానికి రూ.1.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వానకాలం సీజన్ నాటికి సూరమ్మ ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తొట్ల అంజయ్య, ఎండీ.అజీమ్, కల్లెడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో డ్రోన్ స్ప్రేయర్..

- ఫార్మసీ చదివిన యువరైతు కొత్త తరహా వ్యవసాయం


డ్రోన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన గడ్డం మహిపాల్‌రెడ్డి వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌లో బీ.ఫార్మసీ చదివి, కొన్నేళ్లు ఫార్మా కంపెనీల్లో పని చేశాడు. తర్వాత స్వగ్రామానికి వచ్చి, వ్యవసాయం చేస్తున్నాడు. 4 నెలల క్రితం పంట పొలాలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే డ్రోన్ స్ప్రేయర్ కొనుగోలు చేశాడు. తన పొలానికే కాకుండా గ్రామంలోని ఇతర రైతుల పొలాలకు కూడా దీన్ని ఉపయోగిస్తున్నాడు. ఎకరా పంటకు రూ.500 తీసుకొని డ్రోన్ స్ప్రేయర్‌తో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపాడు. కూలీలను పిలవాల్సిన అవసరం లేకుండానే పని పూర్తవుతోందని రైతులు చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్

- ఆదర్శంగా నిలుస్తున్న మల్కాపూర్‌వాసి రాజమణి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లోని మల్కాపూర్‌కు చెందిన పల్లె రాజమణి మహిళా లోకానికే ఆదర్శంగా నిలుస్తోంది. కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను నిర్వహిస్తూ పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఆమె వంటలకు ఫిదా అయిన కలెక్టర్ పమేలా సత్పతి తరచూ క్యాంటీన్‌ను సందర్శిస్తూ రుచిచూస్తున్నారు. క్యాంటీన్‌కు ఆదరణ పెరగడంతో సందడిగా కనిపిస్తోంది. రాజమణి శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలు. 4 నెలల క్రితం వరకు మల్కాపూర్‌లో కర్రీ పాయింట్ నిర్వహించేది. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కలెక్టరేట్ క్యాంటీన్‌ను నడిపిస్తోంది. వివిధ రకాల టిఫిన్లు, భోజనం, పచ్చళ్లు, పిండి వంటలు విక్రయిస్తోంది. 4 పాడి గేదెలను కొనుగోలు చేసి, వాటి పాలతోనే క్యాంటీన్‌లో టీ, పాలు, పెరుగు అమ్ముతోంది. క్యాంటీన్ పల్లె వాతావరణాన్ని మరిపించే చిత్రాలతో ఆకట్టుకుంటోంది. ఆరు బయట చెట్ల నీడన టీ తాగుతూ సేదతీరేలా టేబుళ్లు ఏర్పాటు చేశారు. క్యాంటీన్ నిర్వహణలో కలెక్టర్ మేడమ్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని రాజమణి చెబుతోంది. మహిళా శక్తి క్యాంటీన్‌కు ప్రభుత్వం మరింత ప్రచారం కల్పించాలని కోరుతోంది.


కలెక్టరేట్‌లోని క్యాంటీన్


రాజమణి

1950నాటి నాణెం.. అంబేడ్కర్ స్టాంపులు


సాయిరాం సేకరించిన నాణేలు, స్టాంపులు


సాయిరాం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం చిన్నప్పటి నుంచే దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాట కథలు చదివాడు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు సంబంధించిన క్లిప్పింగులు సేకరించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఏటా జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 2వ తేదీల్లో వాటిని ప్రదర్శిస్తున్నాడు. ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా తాను సేకరించిన నాణేలు, పోస్టల్ స్టాంపులను ప్రదర్శించాడు. 1950లో భారత రాజ్యాంగం అమలైన సందర్భంగా ముద్రించిన రూపాయి నాణెం, వివిధ దశల్లో రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఫొటోతో ముద్రించిన స్టాంపులను సేకరించాడు. వాటిని చూసిన పలువురు సాయిరాంను అభినందిస్తున్నారు.

జమ్మికుంటలో నిత్య జనగణమన

- కార్యక్రమ రూపకర్త అప్పటి సీఐ ప్రశాంత్‌రెడ్డి
- ఆదర్శంగా పలు రాష్ట్రాల్లో నిర్వహణ

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలో 2017 ఆగస్టు 15న ప్రారంభమైన నిత్య జనగణమన కార్యక్రమం ఎనిమిదేళ్లుగా కొనసాగుతోంది. నిత్యం ఉదయం 7 గంటల 52 నిమిషాలకు ప్రధాన కూడళ్లతోపాటు గాంధీ చౌక్ వద్ద ప్రజలు జాతీయ గీతం పాడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవనంలో ప్రజల్లో దేశభక్తి పెంపొందించే లక్ష్యంతో అప్పటి సీఐ, ప్రస్తుత ఏసీపీ సైబర్ క్రైం బ్యూరో హైదరాబాద్ పింగిళి ప్రశాంత్‌రెడ్డి దేశంలోనే తొలిసారి నిత్య జనగణమనకు ఇక్కడ రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, దేశంలోని కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. నిత్య జనగణమన ఒక పండుగ రూపం దాల్చాలని బలంగా కోరుకున్నాను. నా కల నెరవేరినందుకు సంతోషంగా ఉందని ఏసీపీ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని, నిత్యజనగణమన కార్యక్రమానికి కావాల్సిన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి


జాతీయ గీతం పాడుతున్న పోలీసులు, ప్రజలు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలటౌన్: గణతంత్ర వేడుకలకు జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబవుతోంది. వేదిక, స్టాల్స్, టెంట్స్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9గంటలకు కలెక్టర్ సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9.5గంటల నుంచి 9.10వరకు పోలీసుల గౌరవ వందనం, 9.10 నుంచి 09.25 వరకు కలెక్టర్ సందేశం, 9.30 నుంచి 10.00గంటల వరకు ప్రశంసపత్రాల ప్రదానం, అనంతరం వందన సమర్పణ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.

పరిశీలించిన అదనపు కలెక్టర్

పరేడ్ గ్రౌండ్‌లో అధికారులు చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ బీఎస్.లత పరిశీలించారు. ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.


పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేస్తున్న సిబ్బంది

పూలే దంపతుల సేవలు చిరస్మరణీయం


పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: అంటరానితనం నిర్మూలన, అణగారిన వర్గాల హక్కుల సాధన, మహిళా విద్యాభివృద్ధి విషయంలో జ్యోతిబాపూలే దంపతుల సేవలు చిరస్మరణీయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని 9వ వార్డులోని పార్కులో మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. మహనీయులను స్మరించుకోవడం మన విధి అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడం మంచి పరిణామమన్నారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలీ శ్రీనివాస్, నాయకులు గిరి నాగభూషణం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు నాలుగు పథకాలు ప్రారంభం

- ఇప్పటికే గ్రామాల ఎంపిక
- వచ్చిన దరఖాస్తులు 72,454

రేషన్‌కార్డులు	41,964
ఇందిరమ్మ ఇళ్లు	19,720
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	9,701
రైతు భరోసా	1,069
మొత్తం	72,454

జగిత్యాల: ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం నుంచి ప్రారంభించనుంది. ఇందుకోసం వార్డులు, గ్రామాల్లో సభలు నిర్వహించగా.. నాలుగు పథకాలకు 72,454 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి పథకాలు అందించనున్నారు. బీర్‌పూర్ మండలంలో చిత్రవేణిగూడెం, బీమారంలో లింగంపేట, బుగ్గారంలో బీర్సాని, ధర్మపురిలో కమలాపూర్, ఎండపల్లిలో రాజారంపల్లి, గొల్లపల్లిలో అబ్బాపూర్, ఇబ్రహీంపట్నంలో ఎర్రపూర్, జగిత్యాలలో హస్నాబాద్, జగిత్యాలరూరల్‌లో కండ్లపల్లి, కథలాపూర్‌లో పోసానిపేట, కొడిమ్యాలలో రాంసాగర్, కోరుట్లలో సర్పరాజ్‌పల్లి, మల్లాపూర్‌లో కొత్తదాంరాజ్‌పల్లి, మల్యాలలో సర్వాపూర్, మేడిపల్లిలో గుండ్లపల్లి, మెట్‌పల్లిలో విట్టంపేట, పెగడపల్లిలో ల్యాగలమర్రి, రాయికల్‌లో ధర్మాజీపేట, సారంగాపూర్‌లో నాయికపుగూడెం, వెల్గటూర్‌లో చెగ్యాం గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో పథకాలను ప్రారంభిస్తారు.

సందర్శకులకు వసతులు కల్పించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: అంబారిపేటలోని అర్బన్ అటవీ పార్క్‌లో సందర్శకుల కోసం అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. అర్బన్ పార్క్‌ను ఆయన శనివారం సందర్శించారు. అంబారిపేట రైతులకు ఆంక్షలు పెట్టవద్దని, రైతులు పొలాలకు వెళ్లేలా దారి ఉంచాలన్నారు. సందర్శకులకు భద్రత ఉండేలా పార్క్‌లో సీసీకెమెరాలు ఉండాలని, ఐడీ ప్రూఫ్ తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి, కౌన్సిలర్లు నక్క జీవన్, అనుమల్ల జయశ్రీ, దుర్గయ్య, పద్మ, నాయకులు పాల్గొన్నారు.

బండలింగాపూర్‌ను మండలం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌ను మండలం చేయాలని జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఏడాదిన్నర క్రితం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ అయినా ప్రక్రియ నిలిచిపోయిందని, ఈ నేపథ్యంలో గ్రామాన్ని మండలం చేసేందుకు త్వరితగతిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి


వసంత (ఫైల్)

పెగడపల్లి: పెగడపల్లి మాజీ జెడ్పీటీసీ గజ్జల వసంత (58) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. శనివారం ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన పెగడపల్లికి తీసుకొచ్చారు. వసంత 2014లో బీఆర్‌ఎస్ నుంచి పెగడపల్లి జెడ్పీటీసీగా గెలుపొందారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పలువురు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): నాలుగు రోజుల క్రితం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఇల్లంతకుంట మండలం వెల్జిపురం గ్రామానికి చెందిన అట్ల నాగభూషణం మండల కేంద్రం నుంచి గ్రామానికి వస్తుండగా.. గూడ సురేశ్ దంపతులు బైక్‌పై రహీంఖాన్‌పేట వద్ద ఎదురెదురుగా వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అట్ల నాగభూషణం తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వల్లంపట్లకు చెందిన సురేశ్ దంపతులు సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగభూషణం హెల్మెట్ ధరించి ఉంటే బతికేవాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

నిధుల అవకతవకలపై విచారణ చేపట్టాలి


తీర్మానాలు ప్రకటిస్తున్న సీఈవో రాజేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ సహకార సంఘంలో జరిగిన రూ.4కోట్లకు పైగా నిధుల అవకతవకలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని తీర్మానించినట్లు ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి అన్నారు. సంఘం ఆవరణలో పాలకవర్గ సభ్యులు, రైతులతో మహాజన సభను నిర్వహించారు. సంఘంలో కొంతమంది అక్రమార్కులు గత సీఈవోతో కలిసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. రికవరీపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని సహకారశాఖ కమిషనర్‌కి లేఖ రాయనున్నట్లు తెలిపారు. గ్రామశివారులోని సహకార సంఘం పెట్రోల్ బంక్‌ను పునఃప్రారంభించారు. ప్యాక్స్ వైస్ చైర్మన్ దూలూరు సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో పాల్గొన్నారు.

ఓటు ఎంతో విలువైనది

జగిత్యాల: ఓటు ఎంతో విలువైందని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని డీఈవో రాము అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటును మించింది లేదని, కచ్చితంగా ఓటు వేస్తాననే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం పలు గ్రామాలు, పట్టణాల్లో ఓటరు చైతన్య ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్

మెట్‌పల్లి: మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఏటా గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం పోలీస్‌శాఖలో అంకిత భావంతో పని చేసే వారిని ఈ మెడల్స్‌కు ఎంపిక చేస్తుంది. ఏ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రం నుంచి పలువురికి మెడల్స్ ప్రకటించగా.. ఇందులో జిల్లా నుంచి నిరంజన్‌రెడ్డిని ఎంపిక చేసింది.


నిరంజన్‌రెడ్డి

పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా చేరి..

- పోలీస్ శాఖలో 1990లో కానిస్టేబుల్‌గా చేరిన ఆయన మొదటగా జగిత్యాలరూరల్ స్టేషన్‌లో పని చేశారు.
- 1992లో హెడ్ కానిస్టేబుల్‌గా అగ్గిలరీ ప్రమోషన్ పొందారు. 2000 సంవత్సరంలో ఏఎస్సైగా.. 2012లో ఎస్సైగా నియమితులయ్యారు.
- 2023లో మరోమారు అగ్గిలరీ కింద సీఐగా పదోన్నతి పొందారు.
- ఎస్సైగా గొల్లపల్లి, కథలాపూర్, ఎస్‌బీబీ, ఎస్బీలో పని చేశారు.
- సీఐగా మొదట కొంతకాలం విజిలెన్స్‌లో పని చేసి అనంతరం మెట్‌పల్లికి బదిలీపై వచ్చారు.

నక్సలైట్ల నియంత్రణలో చురుకుగా..

- విధుల్లో చేరినప్పటి నుంచి నిరంజన్‌రెడ్డి నక్సలైట్ల నియంత్రణలో చురుకుగా వ్యవహరించారు.
- ఎన్నో ఎదురు కాల్పుల్లో పాల్గొన్న ఆయన ఒక సారి తూటాలు తగిలి గాయాలతో బయటపడ్డారు.
- పలుమార్లు నక్సలైట్లు హెచ్చరించినా వెనక్కి తగ్గలేదు. ఆయన సమర్థతకు మెచ్చి ప్రభుత్వం రెండుమార్లు అగ్గిలరీ ప్రమోషన్లు కల్పించడం విశేషం.
- కథలాపూర్ ఎస్సైగా పని చేస్తున్న సమయంలో నకిలీ డాక్టర్లుగా చెలామణి అవుతున్న పలువురిని పట్టుకొని ఉన్నతాధికారుల మెప్పు పొందారు.

ఎన్నో ప్రశంసలు..రివార్డులు

- అంకితభావంతో పని చేస్తున్న ఆయన ఇప్పటివరకు అనేక ప్రశంసలు, రివార్డులు అందుకున్నారు.
- వీటిలో ఒక ముఖ్యమంత్రి సేవా పతకం, 54 నగదు రివార్డులు, 32 ప్రశంసపత్రాలు, 49 గుడ్ సర్వీస్ ఎంట్రీ (జీఎస్‌ఈ)లు ఉన్నాయి.
- ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ వరించింది.
- ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా అక్కడ నిజాయితీగా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలతో పాటు ఉన్నతాధికారుల మన్ననలు అందుకుంటూ ఆయన పోలీస్ శాఖలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

గ్రామసభల్లో ప్రభుత్వ పాలనను ప్రజలు ఎండగట్టారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

- మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- సంక్షేమ పథకాలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- మొగిలిపేటలో మాజీ సర్పంచ్ నాగరాజుకు పరామర్శ

మల్లాపూర్: మోసపూరిత హామీలు, గ్యారంటీలతో ప్రజలను వంచించి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను గ్రామసభల్లో ప్రజలు ఎండగట్టారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన విషయం తెల్సిందే. ఈ మేరకు ఎమ్మెల్యే శనివారం నాగరాజును పరామర్శించారు. అనంతరం మాట్లాడుతు గ్రామసభలను నామమాత్రంగా.. కాంగ్రెస్ సభల్లా నిర్వహించారని, ఆరు గ్యారంటీలు, హామీలపై నిలదీస్తారనే భయంతోనే పోలీసుల బందోబస్తు పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం తప్ప గ్రామసభలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సభలు వట్టివేనని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పడమే దీనికి నిదర్శనమన్నారు. బడా నాయకులకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం నిరుపేద మాజీ సర్పంచ్‌లకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారి కుటుంబాలు వీధులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మానవీయ కోణంలో ఆలోచన చేసి మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మైదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామ సభలు కావు.. కాంగ్రెస్ సభలు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది గ్రామ సభలు కాదని, కాంగ్రెస్‌పార్టీ సభలని, వీటితో ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సభల్లో ఎవరైనా ప్రశ్నిస్తే కాంగ్రెస్ గుండాలు బెదిరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందని ఆరోపించారు. గ్రామసభలను నామమాత్రంగా నిర్వహించారని, పథకాల్లో చోటు దక్కని వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రకటించిన జాబితా ఫైనల్ కాదని స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. సభల్లో వేదికలపై అర్హత, సంస్కారం లేని కాంగ్రెస్ కార్యకర్తలు కూర్చోవడం బాధాకరమన్నారు. అర్హులకు పథకాలు అందేవరకూ పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు ఫయీం, మురళి, రహీంపాషా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు


ప్రశంస పత్రం అందుకుంటున్న అభయ్‌రాజ్

జగిత్యాల/రాయికల్: దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. అలాగే రాయికల్ మండలం కుమ్మరిపల్లి ఉపాధ్యాయుడు అభయ్‌రాజ్ కూడా తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జిల్లాకేంద్రంలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి మణిదీప్ ప్రదర్శించిన బార్డర్ అలారం ద్వితీయ బహుమతి, వ్యక్తిగత విభాగంలో తెలంగాణ ట్రోఫీ సాధించారు. మెట్‌పల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పరిషత్‌కు చెందిన విద్యార్థులు వర్షిత, వాగ్దేవి రూపొందించిన మల్టీపర్పస్ క్రాప్ ప్రొటెక్టర్ ప్రాజెక్ట్ ప్రత్యేక బహుమతి సాధించింది. కుమ్మరిపల్లి హెచ్ఎం కడకుంట్ల అభయ్‌రాజ్ రూపొందించిన సూపర్ సైన్స్ కిట్‌కు ప్రత్యేక బహుమతి సాధించింది. పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం, మ్యూజియం డైరెక్టర్ విశ్వేశ్వరయ్య చేతుల మీదుగా వీరు బహుమతులు అందుకున్నారు. డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ వీరిని అభినందించారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: ఎన్ని అక్రమకేసులు పెట్టినా భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో 29మంది లబ్ధిదారులకు రూ. 33,64,000 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తనపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఆడపడుచులకు ఇస్తామన్న తులం బంగారం ఎక్కడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్ పథకాలను కేసీఆర్ కొనసాగిస్తే, కేసీఆర్ పథకాలను కాంగ్రెస్ కొనసాగించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం రూ.4లక్షల కోట్లు అప్పుచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే రూ.1.40 లక్షల కోట్ల అప్పు చేసిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు వస్తే.. గ్రామానికి వచ్చేది 21 ఇండ్లు మాత్రమేనన్నారు. కమలాపూర్ ఘటనను దృష్టిలో ఉంచుకుని తాహసీల్దార్ కార్యాలయంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ ఆధ్వర్యంలో వీణవంక ఎస్సై తోట తిరుపతి, ఇల్లందకుంట ఎస్సై రాజకుమార్‌తో పాటు 80మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కనికారపు నర్సయ్య(42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నర్సయ్య శనివారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకోగా కుటుంబసభ్యులు గమనించి 108లో కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే నర్సయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సయ్యకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

బావిలో దూకి వృద్ధురాలు..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మంచిరామి గ్రామానికి చెందిన సింగరం మల్లమ్మ(69) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్లమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇటీవల మతిస్థిమితం కోల్పోయింది. ఈనెల 22న ఇంట్లోంచి ఎటో వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు భావించారు. కానీ, ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శనివారం మృతదేహం లభించడంతో విషాదంలో మునిగారు. భర్త ఏసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు.

పోటీతత్వం పెంచుకోవాలి


బహుమతులు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాల: విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్వీప్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలో రంగవల్లులు, వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన లత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటేనే ఉన్నతస్థాయికి వెళ్లవచ్చన్నారు. వ్యాసరచనలో మెడిసిన్ ఫస్టియర్ విద్యార్థిని జాహ్నవి ప్రథమ, నర్సింగ్ ఫస్టియర్ విద్యార్థిని రజిత ద్వితీయ, ముగ్గుల పోటీల్లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని హిరణ్మయి ప్రథమ, మెడిసిన్ విద్యార్థిని సాయిలక్ష్మీ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి లత బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎండీ.అఖిల్, ఏడీఎం మమత, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిల్ప, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌లిల్లిమేరీ,అధ్యాపకబృందం పాల్గొన్నారు.

సకలమ్మ మృతితో పదిరలో విషాదం


హైదరాబాద్‌లో సకలమ్మకు నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటీ సకలమ్మ(82) మృతితో ఆమె స్వగ్రామం రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో విషాదం అలుముకుంది. సకలమ్మతో ఉన్న అనుబంధాన్ని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన చిన్నతనంలో పదిరలో సోదరితో కలిసే ఉండేవారని స్థానికులు చర్చించుకున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న సకలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. ఆమెకు చీటీ నర్సింగరావు, చీటీ ఉమేశ్ రావు, చీటీ రవీందర్‌రావు కుమారులు. శనివారం హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. మండలం నుంచి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు అందే సుభాష్, కొండ రమేశ్‌గౌడ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, కుంబాల మల్లారెడ్డి, నమిలికొండ శ్రీనివాస్, నర్సింలు, పార్టీ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

సీసీ కెమెరాల మధ్య ఇంటర్ ప్రాక్టికల్

- జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు గుర్తింపు
- ఎంపీసీలో 2,768 మంది..
- బైపీసీలో 1,032 మంది విద్యార్థులు


ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల మూడో తేదీ నుంచి 22 వరకు జరగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలకు తావివ్వకుండా ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించడంతోపాటు పరీక్షలు జరిగే కేంద్రాల్లో ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ప్రాక్టికల్ పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ చివరి సమయంలో ఆచరణలోకి రాలేదు. ఈసారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం అధికారులు జిల్లాలో 47 కేంద్రాలను గుర్తించారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల కోసం 37 కేంద్రాలు, వొకేషనల్‌కు 10 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో 2,768 మంది, బైపీసీలో 1,032 మంది, వొకేషనల్‌లో ఫస్టియర్ విద్యార్థులు 698 మంది, సెకండియర్ విద్యార్థులు 979 మంది ఉన్నారు. పరీక్షలను మూడు విడతల్లో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పారదర్శకత పెరుగుతుంది



ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు కళాశాలలకు ఉత్తర్వులు జారీ చేశాం. విద్యార్థుల కోసం జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు కేటాయించాం. ఈసారి ఇంటర్ ప్రాక్టికల్‌కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వీటి ఏర్పాటుతో పారదర్శకత మరింత పెరుగుతుంది. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

– నారాయణ, ఇంటర్ విద్య నోడల్ అధికారి

ముగిసిన జిల్లాస్థాయి క్రీడలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

జగిత్యాలటౌన్: నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని స్వామి వివేకానంద మినీస్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌గా వెల్గటూర్ మొదటి స్థానంలో.. మల్లన్నపేట టీం రెండో స్థానంలో నిలిచాయి. కబడ్డీలో బీర్పూర్ మొదటి, పెగడపల్లి రెండో స్థానం, కబడ్డీ మహిళల విభాగంలో తాటిపల్లి మొదటి, జగిత్యాల రెండోస్థానంలో నిలిచింది. విజేతలకు జిల్లా యూత్ అధికారి రాంబాబు బహుమతులు అందించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. చైల్డ్ ప్రొటెక్షన్ కో–ఆర్డినేటర్ భూమేశ్, యువకేంద్ర వాలంటీర్ మారం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బామ్మర్దులపై బావ కత్తితో దాడి

- ఇద్దరికి గాయాలు • ఆస్పత్రికి తరలింపు

మల్యాల(చొప్పదండి): కుటుంబ కలహాల నేపథ్యంలో బామ్మర్దులపై దాడి చేశాడో బావ. ఈ ఘటన మండలంలోని ముత్యంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుండోజు చంద్రశేఖర్‌కు జగిత్యాల చెందిన అనసూరి నవ్యతో 2021లో వివాహమైంది. కుటుంబ కలహాలతో ఏడాదిగా భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. జిల్లాకేంద్రంలో చంద్రశేఖర్‌పై వరకట్నం కేసు నమోదైంది. పెద్దమనుషుల సమక్షంలో రెండుసార్లు పంచాయితీ నిర్వహించారు. ఈనెల 26న మరోసారి పంచాయితీ ఉంది. ఈ క్రమంలో చంద్రశేఖర్‌తో మాట్లాడేందుకు నవ్య తండ్రి, అన్నదమ్ములు నవీన్‌కుమార్, శివసాయి ఆయన ఇంటికి వెళ్లారు. మాటామాటా పెరిగి శివసాయి, నవీన్‌కుమార్‌పై చంద్రశేఖర్ కత్తితో దాడి చేసి, గాయపర్చాడు. బాధితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి.. అక్కడినుంచి 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళ క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి గంజాయి తరలించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన పరచ సురేశ్ ఓ బ్యాగులో గంజాయిని తరలించడానికి క్రాస్ రోడ్డు వద్ద నిరీక్షిస్తున్నాడు. అదే సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. సురేశ్ అనుమానంగా కనిపించడంతో తనిఖీ చేయగా బ్యాగులో 500 గ్రాముల గంజాయి కనిపించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని సురేశ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: గొల్లపల్లి రోడ్‌లోని ఓ బార్‌లో కస్తూరి శోభన్‌బాబుపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి చెందిన శోభన్‌బాబు అదే గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులతో కలిసి ఈనెల 22న గొల్లపల్లి రోడ్‌లోని ఓ బార్‌లో మద్యం తాగేందుకు వెళ్లారు. పక్కనే మద్యం తాగుతూ కూర్చున్న బండి శ్రీకాంత్, కుసుంబ నిఖిల్, దీక్షిత్ శోభన్‌బాబుపై దాడిచేశారు. బీరుసీసాతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.